# వరంగల్ వాయిస్

*Evening Daily*

సంపుటి : 04 | సంచిక : 35
పేజీలు : 08 | వెల: రూ.5/-

శనివారం
అక్టోబర్ 19, 2024

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




2లో..

## ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు


- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- హంటర్ రోడ్డులో ఉచిత మెగా హెల్త్ క్యాంప్



వివరాలు2లో..

# ఆశల పల్లకిలో..

- దీపావళికి నామినేటెడ్ పదవులు..!
- ఎదురు చూస్తున్న పార్టీ నేతలు
- ఆలస్యమైతే క్యాడర్ లో నిరుత్సాహం
- నిజమైన కాంగ్రెస్ వాదులకే ఇవ్వాలంటూ డిమాండ్
- జంప్ జిలానీలను పక్కన పెట్టాలని హితవు



దీపావళి పర్వదినానికి నామినేటెడ్ పదవుల భర్తీ జరుగుతుందన్న ప్రచారంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పుష్కర కాలం పాటు ప్రతిపక్షానికే పరిమితమైన పార్టీ సీనియర్ నేతలంతా తమకు ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆనందంలో ఉన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది కావొస్తున్నా తరుణంలో తమ కల నెరవేరబోతోందని సంబుర పడుతున్నారు. అయితే ఇంతకాలం పార్టీని నమ్ముకొని పనిచేయడంతోపాటు కాంగ్రెస్ ను అధికారంలోకి తీసుకొచ్చేందుకు అహర్నిశలు కృషి చేసిన వారికే నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం కల్పించాలన్న డిమాండ్ పెరుగుతోంది. జంప్ జిలానీలను పక్కన బెట్టలని హితవు పలుకుతున్నారు. అప్పడే నిజమైన కాంగ్రెస్ వాదులకు న్యాయం జరుగుతుందంటున్నారు. అయితే దసరాలోపే ఏదో ఒక పదవి పక్కాగా తమను వరిస్తుందని ఆశపడిన కాంగ్రెస్ నేతలకు నిరాశే ఎదురైంది. కనీసం దీపావళికైనా పదవుల పందేరం జరిపి నాయకులు, కార్యకర్తల కళ్లలో ఆనందపు వెలుగులు నింపాలని కోరుతున్నారు. ఆలస్యం చేస్తే.. నేతలు, వాళ్లను నమ్ముకున్న క్యాడరూ.. నిరుత్సాహం చెందే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

-వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి



8లో..

## ఘన వ్యర్థాల నిర్వహణపై ఎక్స్ పో

- ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్
- సాంకేతిక సహకారం అందించేందుకు 10 స్టాళ్ల ఏర్పాటు

## తిన్నదంతా కక్కిస్తాం..

హస్తం అభివృద్ధితో కారు బేజారు

నాడు నెహ్రూ, నేడు రేవంత్ పాలనలో పాలిటెక్నిక్ కు మహర్దశ

మూసీపై ప్రతిపక్షాలు తప్పు తోవ పట్టిస్తున్నాయ్

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని




8లో..




# ఆశల పల్లకిలో..

- దీపావళికి నామినేటెడ్ పదవులు..!
- ఎదురు చూస్తున్న పార్టీ నేతలు
- ఆలస్యమైతే క్యాడర్ లో నిరుత్సాహం
- నిజమైన కాంగ్రెస్ వాదులకే ఇవ్వాలంటూ డిమాండ్
- జంప్ జిలానీలను పక్కన పెట్టాలని హితవు



**వరంగల్ వాయిస్, వరంగల్ ప్రతినిధి :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఇప్పటికే పది నెలలు దాటింది. అంతకు ముందు పది సంవత్సరాలపాటు ప్రతిపక్షానికే పరిమితమయ్యారు. అయితే పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ఎంతోమంది నేతలు, వారిని నమ్ముకున్న క్యాడర్ రాత్రింబవళ్లు కష్టపడ్డారు. తమ కష్టానికి ప్రతిఫలంగా నామినేటెడ్ పదవులు దక్కుతాయని ఆశగా ఎదురు చూస్తున్న వారికి నిరాశే మిగులుతోంది. అప్పుడు..ఇప్పుడూ అంటూ ఊరిస్తున్నారు తప్పితే నామినేటెడ్ పదవులు మాత్రం ఇచ్చిన పాపాన పోలేదు. ముఖ్యమంత్రి ఢిల్లీ పోయినప్పుడల్లా ఇక తమ కష్టాలు తీరినట్లేనంటూ పార్టీ నేతలు ఆశగా ఎదురు చూశారు. రేవంత్ తోపాటు ఇతర ముఖ్య నేతలు తిరిగి ఎప్పుడు హైదరాబాద్ తిరిగి వస్తారా..ఎవరెవరికి పదవులు కట్టబెడతారా అంటూ అంచనాలు వేసుకున్నారు.

### దీపావళికైనా కళ నెరవేరేనా..

దసరా పండుగ నాటికే నామినేటెడ్ పదవులు పక్కాగా ప్రకటిస్తారని అందరూ భావించారు. దసరాకు ముందు ముఖ్యమంత్రితోపాటు ఇతర పార్టీ ముఖ్యులు ఢిల్లీకి పోయినప్పటికీ జమ్ము కాశ్మీర్, హర్యానా ఎన్నికల ఫలితాలపై అధిష్ఠానం పోస్టుమార్టం పనుల్లో నిమగ్నం కావడంతో ఉత్తి చేతుల్తోనే వారు తిరిగి రావాల్సి వచ్చిందన్న ప్రచారం సాగింది. అయితే దీపావళి పండుగకి అందరి కళ్లలో ఆనందపు వెలుగులు నింపుతారంటూ ప్రచారం సాగుతోంది. ఆలస్యం చేస్తే.. నేతలు, వాళ్లను నమ్ముకున్న క్యాడరూ.. నిరుత్సాహం చెందే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికే నేతలందరూ పార్టీ తీరుపై ఆగ్రహంగా ఉన్నట్టు అంతర్గతంగా చర్చ జరుగుతోంది.

### నిజమైన కార్యకర్తలకే పదవులు..

పార్టీని అంటిపెట్టుకొని, అభ్యర్థుల విజయానికి అహోరాత్రులు పనిచేసిన వారికే నామినేటెడ్ పదవులు ఇవ్వాలన్న భావన బలంగా వినిపిస్తోంది. జంప్ జిలానీలను, పార్టీ ద్రోహులను పక్కన బెట్టాలంటున్నారు. పార్టీలోనే ఉండి అభ్యర్థుల ఓటమికి ప్రయత్నించిన వారిని, ఎలక్షన్లు రాగానే కలెక్షన్లకు పాల్పడిన నయవంచకులను పదవులకు దూరంగా ఉంచాలంటున్నారు. పేపర్లలో ఫోజులిచ్చే షో పుటప్ నేతల అభ్యర్థిత్వాలను పరిశీలించవద్దంటున్నారు. నిజమైన పార్టీ నేతలకు న్యాయం జరుగాలంటే ఇంటిలిజెన్స్ రిపోర్ట్ ను పరిగణలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడే పార్టీ కోసం పనిచేసిన నిజమైన కార్యకర్తకు న్యాయం జరుగుతుందంటున్నారు.

### పార్టీలో ప్రచ్ఛన్న యుద్ధం..

పది సంవత్సరాలపాటు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అన్నీతామై వ్యవహరించిన వారికి పార్టీలో ప్రాధాన్యం లేకపోవడంతో బాహటంగానే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ముందు వచ్చిన చెవుల కన్నా వెనుక వచ్చిన కొమ్ములే గొప్ప అన్నట్లుగా ఇతర పార్టీల నుంచి అవకాశవాద రాజకీయాల కోసం వచ్చిన వారితో నిజమైన కాంగ్రెస్ వాదులకు ప్రచ్ఛన్న యుద్ధమే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కనీసం పట్టించుకోకుండా ఆర్థిక, సొంత ప్రయోజనాల కోసం పార్టీ మారిన వ్యక్తులే ఇప్పుడు కీలకంగా మారడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. దీనిపై పాతతరం నాయకులంతా నిట్టూరుస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వివిధ అవసరాల రీత్యా కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారే పెత్తనం చేలాయించడంపై జెండాలు మోసిన సామాన్య కార్యకర్తలు మండిపడుతున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీలోనూ కొత్తగా పార్టీలోకి వచ్చిన వారిదే హవా కొనసాగితే ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నారు.

### ఉన్నత కులాలకే అగ్ర తాంబూలం..

రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీలను అణగదొక్కుతూ అగ్ర కులాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. మంత్రి వర్గంతోపాటు ఇతర అన్ని పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారినే నియమించడం వివాదాలకు దారితీస్తోంది. నామినేటెడ్ పదవుల్లోనూ ఆ సామాజిక వర్గానికే పెద్దపీట వేస్తే అంతర్గత యుద్ధం తప్పదంటున్నారు. అన్ని వర్గాలను ఒక్కటిగా చూడాల్సి ఉన్నప్పటికీ ఒకే ఒక సామాజిక వర్గానికి పెద్ద పీట వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. నామినేటెడ్ పదవుల్లోనైనా సామాజిక న్యాయం పాటించాలని హితవు పలుకుతున్నారు.

# ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా
- హంటర్ రోడ్డులో ఉచిత మెగా హెల్త్ క్యాంప్



**వరంగల్ వాయిస్, క్రైం :** నిరంతరం విధులు నిర్వహించే పోలీస్ సిబ్బందికి ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై అశ్రద్ధ వద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ కుటుంబాలకోసం ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని మెడికవర్ హాస్పటల్స్, శరత్ మాక్స్ విజన్ ఐ హాస్పటల్స్ సౌజన్యంతో ఏర్పాటు ఈ ఉచిత మెగా హెల్త్ క్యాంపుకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తొలుత సీపీ కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజిషియన్, కార్డియాలజీ, గైనకాలజీ, ఆర్థోపెడిక్, న్యూరాలజీ, పల్మనాలనీ, మెడికల్ గ్యాస్ట్రో, కంటి విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పోలీస్ కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ల సూచన మేరకు అవసరమైన వారికి షుగర్, ఈసీజీ, 2డి ఎకో, సీఎఫ్‌టీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్పాటు చేసిన సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించుకున్న వారు అక్కడితోనే సరిపెట్టుకోకుండా డాక్టర్ల సూచించిన సలహాలను పాటిస్తూ సమయానికి మందులను తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సిబ్బంది విధి నిర్వహణలో ఎన్ని వత్తిళ్ళు ఉన్నప్పటికీ ఆరోగ్యం కోసం నిరంతరం వ్యాయామం, యోగ చేయడంతో పాటు దైనందిక ఆహారపు అలవాట్లలో మార్పు అవరసమన్నారు. ఈ వైద్య శిబిరంలో సహకరించిన మెడికవర్, మాక్స్ విజన్ హస్పటల్స్ యాజమాన్యం, వైద్యులు, సిబ్బందికి సీపీ అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వెస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఆర్ఐలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్ఐలు, ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, వైద్యులు పాల్గొన్నారు.



# దేవాలయాలపై దాడులను సహించం

- వారిని కఠినంగా శిక్షించాలి
- వీహెచ్ పీ వరంగల్ విభాగ్ సహ ప్రముఖ్ శ్రీరామ్ ఉదయ్ కుమార్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సికింద్రాబాద్ లోని ముత్యాలమ్మ గుడిపై దాడికి నిరసనగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు శనివారం హనుమకొండ చౌరస్తాలో మతోన్మాది దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ వరంగల్ ఉమ్మడి జిల్లా విభాగ్ సహ ప్రముఖ్ శ్రీరామ్ ఉదయ్ కుమార్ మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ లోని ముత్యాలమ్మ గుడితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా హిందువుల దేవాలయాలలో ప్రవేశించి హిందువులు పరమ పవిత్రంగా పూజించే దేవతా మూర్తులను పగలగొట్టడం, విరగొట్టడం, శిరచ్ఛేదనం చేసేటువంటి వ్యక్తులను ఉరితీయాలన్నారు. హనుమకొండ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టర్, వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ లకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. సికింద్రాబాద్ లో శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేస్తున్న హిందువులపై లాఠీచార్జి చేయడాన్ని విశ్వహిందూ పరిషత్ తీవ్రంగా ఖండించింది. హిందువుల దేవాలయాలను కూలగొట్టే వ్యక్తులను వదిలిపెట్టి చట్టాలను రాజ్యాంగాన్ని పోలీసులను గౌరవించే అమాయక హిందువులపై పోలీస్ లాఠీ ఛార్జి చేయడం ఇది ముమ్మాటికి హేయమైన చర్యగా విశ్వహిందూ పరిషత్ భావిస్తోంది. లాటీ చార్జి చేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ వరంగల్ మహా నగర అధ్యక్షులు కేసిరెడ్డి జైపాల్ రెడ్డి, కార్యదర్శి వెలగందుల రాజు, సహకార దర్శి ఏడెల్లి సందీప్ రెడ్డి, బజరంగ్ దళ్ వరంగల్ మహానగర్ సంయోజక్ కొల్లూరి ఆదిత్య సాయి, విశ్వవిద్యాలయ ప్రఖండ కార్యదర్శి కనుకుంట్ల వెంకటేశ్వర్లు, ధర్మాచార్య ప్రముఖ్ గూడూరు రాకేష్, గన్ను రామానుజం, వలస అశోక్, నాగపురి వెంకటేష్, తారక్, రాజ్ కుమార్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీనియర్, జూనియర్ నాయకులంతా కలిస్తే పార్టీకి బలం

### కాంగ్రెస్ సీనియర్ నేత నాయిని సత్యపాల్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** కాంగ్రెస్ పార్టీ సీనియర్, జూనియర్ నాయకులంతా కలిసి పనిచేస్తే పార్టీకి కొండంత బలమని కాంగ్రెస్ సీనియర్ నేత నాయిని సత్యపాల్ రెడ్డి అన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల ప్రెస్ మీట్ నాయిని సత్యపాల్ రెడ్డి మాట్లాడుతూ నిన్న ఎమ్మెల్యే సీఎంఆర్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీలలో తమకు చోటు కల్పించలేదని కొంతమంది ఎమ్మెల్యేలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఎమ్మెల్యే మురళి నాయక్ మండలంలోని ప్రతి గ్రామం నుంచి ఒకరిని ఇందిరమ్మ కమిటీలో పేర్లు సూచించాలని అడిగారు. వాటికి అనుగుణంగానే పేర్లు పంపించామని, మా ప్రమేయం ఏమీ లేదని, మాపైన కావాలని బురదజల్లే కార్యక్రమం చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజన ఎమ్మెల్యేను ఊర్లలో తిరగనియ్యమంటూ వ్యాఖ్యలు చేయడం సరికాదని హితవు పలికారు. సీనియర్, సీనియర్ అంతా కలిసి అసెంబ్లీ ఎన్నికలో పని చేస్తేనే ఎమ్మెల్యేకు 50 వేల మెజార్టీ వచ్చిందన్నారు. ఎంపీ ఎన్నికలో బలరాం నాయక్ ను కూడా అందరం కలిసి పని చేసి మంచి మెజారిటీతో గెలిపించుకున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ జిల్లా నాయకులు కాసం లక్ష్మారెడ్డి, గూగుల్ బాలాజీ నాయక్, పట్నాశెట్టి నాగరాజు, పులి వెంకన్న, జెల్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐతో పత్తి కొనుగోలు చేయాలి

### ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు



**వరంగల్ వాయిస్, పరకాల :** ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీసీఐ ఏర్పాటు చేసి పత్తి కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు అన్నారు. ఆయన మాట్లాడుతూ సీసీఐ పత్తి రేటు 7521 ఉండగా ప్రైవేట్ వ్యక్తులు రూ.6000 నుంచి 6500 వరకు కొనుగోలు చేస్తున్నారని, రైతులు ఒక క్వింటాల్‌కు 1000 నుంచి 1500 నష్టపోతున్నారని, ఒక రైతు సాధారణంగా 10క్వింటాల పత్తి అమ్మితే పదివేల రూపాయలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో వర్షం ప్రభావంతో నష్టపోయిన రైతుల నుంచి ప్రైవేటు వ్యక్తులు పత్తి కొనుగోలు చేస్తూ ఆర్థికంగా మోసగిస్తున్నారు. వెంటనే సీసీఐ పత్తి కొనుగోలు సెంటర్లను ఏర్పాటు చేసి రైతులకు లాభం చేకూర్చాల్సిందిగా డిమాండ్ చేశారు.

## బాధితురాలికి ఆర్థిక సాయం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** రామన్నపేటలోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా పద్మ బ్రాహ్మణ అధ్యక్షుడు మలిపెద్ది కృష్ణ శాస్త్రి సంయుక్తంగా శాయంపేటలో నివసిస్తున్న మార్త వేణుగోపాల్ కోశాధికారి సతీమణి మార్త జ్యోతి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ భారతి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు హనుమకొండ జిల్లా పద్మ బ్రాహ్మణ పురోహిత సంఘ సభ్యులు మార్త రాజకుమార్, పల్నాటి జలంధర్, మామిడి సురేష్, మామిడి శివ సాయి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మలిపెద్ది కృష్ణశాస్త్రి, డాక్టర్ రాజేంద్రప్రసాద్ వారి ఆయురారోగ్యాలు మానసిక స్థితి క్షేమంగా ఉండాలని మార్త జ్యోతికి ఆర్థిక సాయం అందజేశారు.

# పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

### ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, సంగెం :** పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శనివారం సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో సంగెం మండలం, 17వ డివిజన్ కు చెందిన 87 మంది లబ్ధిదారులకు రూ.87 లక్షల1092 విలువ గల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 50 మంది లబ్ధిదారులకు రూ.14 లక్షల 96 వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరమని గతంలో ఎమ్మెల్యే, ఎంపీల కార్యాలయాల వద్ద చెక్కుల కోసం పడిగాపులు కాచేవారని నేడు లబ్ధిదారులకు నేరుగా అందజేయడం జరుగుతుందన్నారు. పేదింటి ఆడబిడ్డలకు అండగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిలుస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం కళ్యాణ లక్ష్మి ద్వారా ఆర్థిక సహాయం 1183 మందికి రూ.11 కోట్ల 84 లక్షల 37వేల 228, సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా 755 మంది లబ్ధిదారులకు రూ.2కోట్ల 35 లక్షల 07 వేల 500లను, ఎల్‌ఓసీ పథకం ద్వారా 57 మందికి రూ.1 కోటి 04 లక్షల 45 వేల విలువ గల చెక్కులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయంతో పంపిణీ చేశామని తెలిపారు. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు. పేదలకు కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎం సహాయ నిధి పథకం ద్వారా సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం..

మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఝాన్సీ లక్ష్మిభాయి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. ఏ గ్రేడ్‌కు రూ. 2320, కామన్ రకానికి రూ.2300 ధర చెల్లిస్తుందని, రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సన్న రకం ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తున్నట్లు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం 17శాతం మాయుచర్ ఉండాన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. రవాణ, హమాలీలు, గోనె సంచుల కొరత రాకుండా చూడాలని అన్నారు.

## అదనపు షెడ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు :** మల్లంపల్లి, జంగాలపల్లి మార్కెట్ లలో అదనంగా నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణ పనులల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మల్లంపల్లి గ్రామపంచాయితీ ఆవరణంలో ఉన్న మార్కెట్ లో, జంగాలపల్లిలోని మార్కెట్ లో అదనంగా నిర్మిస్తున్న షెడ్ల నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు మీద పేదవారు చిన్న చిన్న టెంట్లు వేసుకొని వ్యాపారం చేయడం వలన ట్రాఫిక్ అంతరాయం జరుగుతుందని, అమ్ముకొని జీవించే వారికి ఇబ్బందులు కలగకుండా అదనంగా షెడ్స్ అవసరం ఉన్నందున నిర్మించుట జరుగుతుందన్నారు. వర్షపు నీరు నిలువ ఉండకుండా ఇంకుడు గుంతలు నిర్మించాలని, చుట్టూ ఫెన్సింగ్ కొట్టించాలని సూచించారు. ఎంబీ రికార్డ్ ప్రకారమే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని, నాణ్యత లోపం ఉంటే బిల్లులలో కోతలు విధిస్తామన్నారు. పనులు నిర్దిష్ట గడువులోగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇంచార్జి సంపత్ రావు, ఏపీఓ రాజు, జేఈ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ సతీష్, పంచాయతీ సెక్రటరీ రాజు పాల్గొన్నారు.

## క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయాలి

### డాక్టర్ గుగులోత్ రవి నాయక్



**వరంగల్ వాయిస్, మరిపెడ :** క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయాలని స్థానిక పీహెచ్ సీ వైద్యాధికారి డా.గుగులోత్ రవి నాయక్ అన్నారు. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న గిరిపురం గ్రామంలో జరుగుతున్న సమగ్ర వ్యాధి నిరోధక కార్యక్రమాన్ని(యూనివర్సల్ ఇమ్యూనైజేషన్స్ సెషన్) వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి సందర్శించారు. వాక్సిన్ కారియర్, వాక్సిన్ కండిషన్ పరిశీలించారు. అదే విధంగా వాక్సిన్ డ్యూ లిస్ట్ వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ పుట్టిన పిల్లల నుంచి 16 సంవత్సరాల వరకు పిల్లలకు, ప్రతి గర్భిణీ స్త్రీలకు తప్పనిసరిగా ఈ వాక్సిన్ కార్యక్రమాన్ని ప్రతి బుధవారం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో, ప్రతి శనివారం ప్రణాళిక ప్రకారం వివిధ గ్రామాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ లక్ష్మి కుమారి, ఏఎన్ఎంలు నర్సుబాయి, నాగమణి, ఆశ ఆరోగ్య కార్యకర్త కవిత, తదితరులు పాల్గొన్నారు.

# రేపటి కౌన్సిల్‌ను జయప్రదం చేయండి

### పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు



**వరంగల్ వాయిస్, ఖిలా వరంగల్ :** రేపు నర్సంపేటలో జరుగు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్ ను జయప్రదం చేయాలని కోరుతూ ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్, ఏరియా వై జంక్షన్ లో ప్రజా సంఘాల నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు.కౌన్సిల్ కార్యక్రమంలో ముందుగా ఉదయం 11గంటలకు నర్సంపేట బస్టాండ్ సెంటర్ లోని అమరవీరుల స్థూపం వద్ద నుంచి అరుణోదయ కళాకారులతో ప్రదర్శన ఉంటుందని, ఆ తర్వాత మాదన్నపేట రోడ్డుకు ఉన్నటువంటి సిటిజన్ క్లబ్ లో, కౌన్సిల్ ప్రారంభమవుతుందని, అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు బహిరంగ సభ జరుగుతుందని వారు తెలిపారు. ఈ సభకు అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు పి.వేణు అధ్యక్షత వహిస్తారని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కె.గోవర్ధన్ ఆంధ్రప్రదేశ్ అరుణోదయ అధ్యక్షుడు చొప్పరి జాలన్న, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి గౌని ఐలయ్య, ప్రముఖ కవి గాయకులు యోచన, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, అరుణోదయ రాష్ట్ర నాయకులు తారాచంద్, ఇడంపాక శ్రీశైలం, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పూలక్క, పీడీఎస్ యూ రాష్ట్ర నాయకులు జి అజయ్ లు ప్రసంగిస్తారని, వారు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ సభలో అరుణోదయ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు, పీవైఎల్ జిల్లా నాయకులు గండ్రతి హరిబాబు, ఐఎఫ్ టీయూ నగర ప్రధాన కార్యదర్శి బన్న నర్సింగం, సాంబయ్య, ఇనుముల కృష్ణ, ఎండీ అక్బర్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శనివారం 19, అక్టోబర్ 2024
www.warangalvoice.net

# టోల్ గేట్ రుసుం వసూలు నిలిపివేయాలి

## జిల్లా కలెక్టర్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



**వరంగల్ వాయిస్, కాటారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల సరిహద్దు ప్రాంతమైన మేడిపల్లి వద్ద జాతీయ హైవే అథారిటీ ఏర్పాటు చేసిన టోల్ గేట్ వద్ద రుసుం వసూలను నిలిపివేయాలని భారత రాష్ట్ర సమితి కాటారం సబ్ డివిజన్ నాయకులు జోడు శ్రీనివాస్, రామిల్ల కిరణ్, జక్కు శ్రావణ్ లు జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. శనివారం గుట్టు చప్పుడు కాకుండా దొంగ చాటున నేషనల్ హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్లు టోల్ గేట్ ను ఎవరికి తెలియకుండానే ప్రారంభించారని వారు దుయ్యబట్టారు. ఈ విషయమై అధికారులను, సంబంధిత కాంట్రాక్టు సిబ్బందిని ప్రశ్నించగా వారి నుంచి సరైన సమాధానం రాలేదన్నారు. భూపాలపల్లి జిల్లా కాటారం, మహాదేవపూర్ మండలాల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు హైదరాబాద్ కు తరలి వెళ్తున్న నేపథ్యంలో రోడ్డు గుంతలు గుంతలుగా ఏర్పడ్డాయని వారు వెల్లడించారు. దాంతో అనేక సందర్భాల్లో ప్రమాదాలు జరిగి ఎందరో మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయనీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టోల్ గేట్ రుసుం వసూలు చేయడం సమంజసం కాదని వారు అన్నారు. జాతీయ హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్లు తక్షణమే రోడ్డును బాగు చేయించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డును బాగు చేసిన తర్వాతనే టోల్ గేట్ రుసుము వసూలు చేయాలని కలెక్టర్ కు అందజేసిన వినతి పత్రంలో వారు కోరారు. ఇదీలా ఉండగా టోల్ గేట్ ప్రారంభించిన విషయం తెలుసుకున్న సమీప గ్రామ ప్రజలు, భూ నిర్వాసితులు పెద్దఎత్తున టోల్ గేట్ వద్ద నిరసన తెలిపడంతో పాటు నిర్వాసితులకు సరైన న్యాయం చేయలేదని వారు ఆందోళన చేశారు. వరంగల్ ఏరియా డీఈ కుమారస్వామిని టోల్ గేట్ ప్రారంభం సమాచారం విషయమై స్థానిక విలేకరులు అడగగా తమకు ఏమీ సంబంధం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు.

## గురి తప్పని విలుకాడు పుస్తకావిష్కరణ



వరంగల్ వాయిస్, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కాకతీయ విశ్వవిద్యాలయం, జర్నలిజం విభాగాధిపతి డా.సంగని మల్లేశ్వర్ రచించిన "గురి తప్పని విలుకాడు" అనే పుస్తకాన్ని ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, మేడిపల్లి సత్యం, ఎమ్మెల్సీ దండే విఠల్ పలువురు గ్రంథాలయ సంస్థ చైర్మన్లతో కలిసి శనివారం ఆవిష్కరించారు. అనంతరం పుస్తకం రచించిన రచయితకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జమాండ్ల అశోక్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** పీఆర్ టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జమాండ్ల అశోక్ నియమితులయ్యారు. హైదరాబాద్ లో ఇటీవల జరిగిన ఆ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో చెన్నారావుపేట మండలం కోనాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జమాండ్ల అశోక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన పీఆర్ టీయూటీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్లో జమాండ్ల అశోక్ పనితీరును దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జమాండ్ల అశోక్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో అసోసియేట్ అధ్యక్షుడిగా సముచిత స్థానం కల్పించిన రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దామోదర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గఫార్, చెన్నారావు పేట మండల అధ్యక్షుడు పూజారి సురేందర్, ప్రధానకార్యదర్శి వీరన్నకు ధన్యవాదాలు తెలిపారు. నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బరిలో నిలుస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్ రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జన విజ్ఞాన వేదిక తెలంగాణ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష తెలంగాణ వారి సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాలు-2024 పోస్టర్ ను వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనా రెడ్డి అధ్యక్షతన వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ ఆవిష్కరించారు. నవంబర్ 7న పాఠశాల స్థాయి, నవంబర్ 21న మండల స్థాయి, నవంబర్ 28న జిల్లా స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని, రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు డిసెంబర్ 14, 15, 16 తేదీలలో ఆదిలాబాద్ లో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఇంద్రాసేనా రెడ్డి తెలిపారు. సైన్స్ పట్ల విద్యార్థులకు మక్కువ కలిగించేందుకు, సైన్స్ పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ పోటీలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ శ్రీనివాస్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు సుధాకర్, కోశాధికారి అశోక్, గౌరవ అధ్యక్షుడు పిండం భాస్కర్, చెకుముకి కన్వీనర్ ఎండీ రాయబోస్, పర్యావరణ కమిటీ కన్వీనర్ బూరుగు నవీన్, విద్యా కమిటీ కన్వీనర్ మాధవ రెడ్డి, సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సురేష్, జిల్లా కార్యదర్శులు డా సామలశశిధర్ రెడ్డి, పాక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్రంలో చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ లను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు మడికొండ రఘుపతి డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు స్కాలర్ షిప్ లు విడుదల చేయడం లో నిర్లక్ష్యం వహించాయని, తద్వారా విద్యార్థులు మరోపక్క కళాశాల యాజమాన్యాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం అలసత్వం చేయకుండా వెంటనే పెండింగ్ స్కాలర్ షిప్ లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

## పాఠశాలలో పేరెంట్-టీచర్ మీటింగ్



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్ -టీచర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు పాక రమేష్ బాబు మాట్లాడుతూ విద్య, సంబంధిత కార్యకలాపాల ప్రయోజనాలు, ఉపకార వేతనాలు, ఉన్నత విద్యాసంస్థలకు, ఉద్యోగ నియామక సంస్థలకు (ఏపీఏఏఆర్) ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ ఐడీ కార్డును ప్రతి విద్యార్థి కలిగి ఉండాలని, దానికి తల్లిదండ్రులు అంగీకారం తెలపాలని కోరారు. సమావేశంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాశిబుగ్గలో బీజేపీ సభ్యత్వ నమోదు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ జంక్షన్‌లో శనివారం సంయుక్త మోర్చాల సభ్యత్వ నమోదు ప్రముఖ్ వన్నాల వెంకటరమణ, వరంగల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, వరంగల్ జిల్లా ఓబీసీ సభ్యత్వాల ప్రముఖ కుమార్ నాగరాజు ఆధ్వర్యంలో సంయుక్త మోర్చాల సభ్యత్వ డ్రైవ్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పాల్గొని పలువురితో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వ నమోదు ప్రముఖ్ కుసుమ సతీష్, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, సిద్ధం నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్ కుమార్, ప్రచార కార్యదర్శి బైరి శ్యాంసుందర్, సోషల్ మీడియా కన్వీనర్ ఇనుముల అరుణ్, 21వ ఓబీసీ అధ్యక్షుడు మడిపెల్లి నాగరాజు గౌడ్, 23వ డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు కందగట్ల మల్లికార్జున్, 34వ డివిజన్ ఓబీసీ అధ్యక్షుడు బోడకుంట్ల శివశంకర్, బీజేపీ 34వ డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, నాయకులు ముంద్రాతి వెంకటేశ్వర్లు, ఓబీసీ జిల్లా పదాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సీతారాంపురంలో ఒకటి, రెండు, మూడవ తరగతి చపువుతున్న 40మంది విద్యార్థులకు స్థానిక కాంగ్రెస్ నాయకుల సౌజన్యంతో ఉచితంగా ప్లేట్లు, గ్లాసులు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుగులోత్ అర్జున్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి మనస్సుతో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తాజుద్దీన్, కాంగ్రెస్ సీనియారిటీ మండల మైనార్టీ నాయకులు షేక్ అఫ్జల్, బోర గంగయ్య, డాక్టర్ ముత్యం రాకేష్, షైక్ యాకుబ్ పాషా, సర్వర్, లింగయ్య, బల్లెం రవి, శ్రీను, మల్సూర్, వెంకటేష్ పాఠశాల ఉపాధ్యాయులు గుగులోతు మంగీలాల్, లింగాల మహేష్ గౌడ్, వెంకటేశ్వరరావు, సందీప్, కవిత, ఆదిలక్ష్మి, సారిక విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సోమిడిలో విజిలెన్స్ అవగాహన సదస్సు



**వరంగల్ వాయిస్, కాజీపేట :** భారత ఆహార సంస్థ కాజీపేట ఆధ్వర్యంలో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ పిలుపు మేరకు శనివారం సోమిడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజిలెన్స్ అవేర్ నెస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ కాంపిటీషన్-యాంటీ కరప్షన్ అనే అంశం మీద నిర్వహించారు. అదే విధంగా విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా భారత ఆహార సంస్థ మేనేజర్ కె.రాజేంద్రప్రసాద్, మోహన్ కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులకు అవినీతి నిర్మూలన అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భారత ఆహార సంస్థ ఉద్యోగులు దిండిగాల అనిల్, జగదీష్, ఐతరాజు, హరికిషన్, కార్తీక్, శంకర్, ఉమేష్, శుద్ధోదన్, పాఠశాల హెడ్ మాస్టర్ శోభ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి జూడో పోటీలకు ఏవీవీ విద్యార్థులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కెమిస్ట్ భవన్ వరంగల్ లో నిర్వహింపబడిన జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీల్లో ఏవీవీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎస్.ప్రణీత్ ప్రథమ స్థానం, వి.నవదీప్ ద్వితీయ స్థానం సాధించారు. జిల్లా స్థాయిలో ఈ నెల 28న జరిగే పోటీలలో పాల్గొంటున్నందున వీరిరువురిని ఏవీవీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.భుజేందర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ గోపి, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాజశేఖర్, భాస్కర్, కళాశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## విద్యా నిధి పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం 2024-25 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ శనివారం ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం విదేశీ విద్యాలయాలల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు “అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం” ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు 20 లక్షల రూపాయల స్కాలర్ షిప్ అందించుటకు నిర్ణయించారు. యూఎస్ఏ, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మని, జపాన్, సౌత్ కొరియా, న్యూజిలాండ్ విశ్వ విద్యాలయాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలగు ప్రొఫెషనల్ కోర్సులల్లో చదువాలనుకుంటున్న ఎస్సీ విద్యార్థుల నుంచి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి పి.నర్మద నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 29 చివరి తేదీ. కాబట్టి, జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థులు ఈపాస్ వెబ్ సైట్ లో www.telangana.epass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నిర్దిష్టమైన ఫార్మాటకలలె అవసరమైన డాక్యుమెంట్లతో విద్యార్థులు ధరఖాస్తు చేసుకోవాలని, ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు ఈపాస్ వెబ్ సైట్ లోలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల జిల్లా ఉపాధ్యక్షుడిగా దీకొండ భిక్షపతి



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం సంక్షేమం కోసం ఏర్పాటు చేసినటువంటి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీలో భాగంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్.చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా హసన్ పర్తి మండల కేంద్రానికి చెందిన పద్మశాలి ముద్దుబిడ్డ దీకొండ భిక్షపతిని నియమిస్తూ ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుల ఐక్యతకు తన వంతు సహకారాలు అందిస్తానని, తన నియామకానికి సహకరించినటువంటి జిల్లా అధ్యక్షుడు భాష బోయిన రవీందర్ యాదవ్, వర్ధన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు చిలువేరు రమేష్, ఉద్యమకారులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** మండలంలో జరుగుతున్నటువంటి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మహబూబాబాద్ జిల్లా పశు వైద్య పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.కిరణ్ కుమార్ శనివారం విచ్చేసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలు వేసుకోవాలన్నారు. నాలుగు నెలలు వయస్సున్న దూడల నుంచి ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాల్సిందిగా సూచించారు. టీకాలు వేసుకుంటే పశువులు ఈడ్చుకొని పోతాయి, దూడలు చనిపోతాయి, పాలు తగ్గుతాయనే అపోహలు వీడి తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేసుకోవాలన్నారు. టీకాలు వేసుకున్న పశువులకు సంవత్సరం వరకు రోగ నిరోధక శక్తి ఉంటుందన్నారు. దేశంలో ఉన్న గాలికుంటు వ్యాధిని తరిమికొట్టడమే ఈ ప్రోగ్రాం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ పి.నాగేశ్వరరావు, పశు వైద్య సిబ్బంది చందర్, సులేమాన్, వెంకన్న, అశోక్, రజిని తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీలకు హారిక, రిత్విక్ ఎంపిక

**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** మండలంలోని కొంకపాక, పర్వతగిరి ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు వి.రిత్విక్, భూక్య హారికలు రాష్ట్రస్థాయి కళా ఉత్సవ పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. జిల్లా స్థాయిలో బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ వరంగల్ లో జరిగిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్-24 పోటీల్లో స్టోరీ టెల్లింగ్ విభాగంలో భూక్య హారిక జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో ఎంపిక కాగా, వల్లందాస్ రిత్విక్ ఇన్ స్ట్రుమెంట్ మ్యూజిక్ విభాగంలో మొదటి స్థానాన్ని నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

# రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

### మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సేవ కోసం పని చేస్తుందని, రైతాంగానికి పెద్ద పీట వేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. శనివారం రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామంలో కంచనపెల్లి సొసైటీ ఆధ్వర్యంలో వడ్లు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి చైర్మన్ చీమలపాటి రవీందర్ జి అధ్యక్షత వహించగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని, రైతు భరోసాపై కూడా తొందరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని, పదవులు అమ్ముకోవడం, కాంట్రాక్టులు అమ్ముకోవడం మా లక్ష్యం కాదని, ప్రజాసేవే నా ధ్యేయమని ఆయన అన్నారు. త్వరలో ఇందిరమ్మ కమిటీలు పూర్తి తర్వాత ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. కంచనపల్లి గ్రామానికి అధిక నిధులు కేటాయించి పనులు చేపడతానని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రాజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీలు మారుజోడు రాంబాబు, లింగాల జగదీష్, చంద్రా రెడ్డి, మాజీ ఎంపీపీ మేకల వరలక్ష్మి నరేందర్, మార్కెట్ డైరెక్టర్లు గాదె రమేష్ పటేల్, తోటకూర రమేష్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, గాదె మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు రాపోలు రామ్మూర్తి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ఏకపాత్రాభినయం అట్టర్ ప్లాప్

### టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ ఎద్దేవా



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మూసీ నది పునరుజ్జీవం అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ అంతా ఆత్మస్తుతి.. పరనిందలాగా ఉందని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ విమర్శించారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ వాస్తవాలను వక్రీకరించి, అవాస్తవాలను వల్లెవేస్తూ, తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని చేసిన కేటీఆర్ ఏకపాత్రాభినయం అట్టర్ ప్లాప్ అయిందని ఎద్దేవా చేశారు. ఏ ప్రభుత్వమైనా ఏదైనా ప్రాజెక్టును ప్రారంభించే ముందే ప్రాధాన్యతలను తెలియజేస్తే, నిపుణులు విధివిధానాలను, పునరావాస ప్యాకేజీలను, బడ్జెట్ అంచనాలను రూపొందించి నివేదిక సమర్పిస్తారు. అపుడు ప్రభుత్వం ఆ నివేదికపై పూర్తిస్థాయి సమీక్ష జరిపి పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తుంది. మాజీ మంత్రి కేటీఆర్ కు ఈమాత్రం తెలియదా అని బండి సుధాకర్ గౌడ్ ప్రశ్నించారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనప్రాయంగా చెబితే, 1 లక్షా 50 వేల కోట్ల రూపాయలు లూటీ జరుగుతుందని కేటీఆర్ గోబెల్స్ ప్రచారం చేయడం ఆయన అవివేకానికి నిదర్శనమని బండి దుయ్యబట్టారు. కేటీఆర్ మున్సిపల్ మంత్రిగా ఉన్నపుడు మూసీ నదిపై సమీక్ష చేసి, ఎఫ్ టీఎల్, బఫర్ జోన్లు ఫిక్స్ చేసి, నిర్వాసితులకు టీడీఆర్ బాండ్లు, డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వాలని నిర్ణయించింది నిజం కాదా? అని బండి గుర్తు చేశారు. వికారాబాద్ అనంతగిరి కొండల నుంచి నల్లగొండ జిల్లాలో కృష్ణా నదిలో కలిసేదాకా దాదాపు 3 లక్షల 25 వేల ఎకరాలకు సాగునీటికి, భూగర్భ జలాలు పెరిగి సాగునీటికి ఉపయోగపడుతున్న మూసీని అవహేళన చేయడం కేటీఆర్ దురహంకారానికి నిదర్శనమేనని బండి విమర్శించారు. అధికారం పోయిన బాధను జీర్ణించుకోలేని కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నాడని, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మబోరని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని బండి హెచ్చరించారు.

## నరకాసుర వధకు పటిష్ట పోలీస్ బందోబస్తు

### వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దీపావళి పండుగ సందర్భంగా నరక చతుర్దశి రోజున ఉర్సు గుట్ట వద్ద కుడా గ్రౌండ్ లో జరుగు నరకాసుర వధ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా శాంతిభద్రతల పరిరక్షణకు తగు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయిస్తానని కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. 19న నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో సీపీ కార్యాలయంలో బొకే ఇచ్చి వినతిపత్రం అందజేశారు. 58 పీట్ల ఎత్తుతో తయారు చేసిన నరకాసుర విగ్రహన్ని బాంబులు అమర్చి ముఖ్య అతిథి చే వధ కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ నరకాసుర వధ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు దాదాపు 20 వేల మంది ప్రజలు హాజరవుతారని అధ్యక్షుడు మరుపల్ల రవి సీపీ అంబర్ కిషోర్ ఝాకు తెలిపారు. ఈ ఉత్సవాలకు విశిష్ట అతిథిగా విచ్చేయాలని ఆహ్వాన పత్రికను ఆయనకు అందచేశారు. ఈ కార్యక్రమంలో నరకాసుర వద ఉత్సవ కమిటీ సహాయ కార్యదర్శి అవునూరి రాంమూర్తి, కార్యనిర్వాహక కార్యదర్శి వనం కుమార్, ప్రచార కార్యదర్శి మరుపల్ల గౌతమ్, ఆర్గనైజర్లు దూడే బాలకొమురెల్లి, సభ్యులు తవుటం నర్సింహాలు ఉన్నారు.

## ఇచ్చిన మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులు అందరం ఐక్యమై ఆసరా పింఛన్ పెంపునకు నవంబర్ 26న జరగబోవు వికలాంగుల విజృంభన సభకు జనగామ జిల్లా ఆసరా పింఛన్ దారులు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జనగామ జిల్లా నాయకుడు గడ్డం సందీప్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిర్రు నాగేష్ ఆదేశాల మేరకు మన పల్లెల్లో మండల కమిటీలను, వీహెచ్‌పీఎస్ నాయకులను, కార్యకర్తలను కలుస్తూ ప్రతి మండలంలో మీటింగ్ నిర్వహిస్తూ నవంబర్ 26న నిర్వహించే సభ విజయవంతం చేయాలని ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. త్వరలోనే జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు జరుగుతుందని గడ్డం సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గడ్డం సోమరాజ్, తిప్పారావ్, జ్యోతి మహిళా విభాగం, చిలక రమేష్, తేజావత్ వెంకటేశ్వర్లు, ఆరేళ్ల భిక్షపతి, నూనె ముంతల రాజు, లగిశెట్టి యాదగిరి పాల్గొన్నారు.

# మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించండి



## అలుగుబెల్లి నర్సిరెడ్డి

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం వరంగల్–ఖమ్మం–నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ నమోదు కార్యక్రమం ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల రంగశాయిపేటలో జరిగింది. ఈ కార్యక్రమంలో అలుగుబెల్లి నర్సిరెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వరంగల్ ఉపాధ్యాయ నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలలో అర్హత గల ఉపాధ్యాయులందరూ నవంబర్ 6లోపు ఓటర్ గా నమోదు చేసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. శాసనమండలి అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని, ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు కృషి చేస్తానని, అన్ని రకాల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం, నిజాయితీగా కృషి చేస్తానని, ఉపాధ్యాయ అధ్యాపక పక్షంగా ఉంటానని తెలిపారు. మరొకసారి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. అలాగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల నరేంద్ర నగర్, శివనగర్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైడిపల్లి, బీసీ గురుకుల పాఠశాల ఆరేపల్లి, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల గీసుకొండ, మైనారిటీ గురుకుల పాఠశాల పరకాలలను సందర్శించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, సుజన్ ప్రసాదరావు, జిల్లా కోశాధికారి రవూఫ్, జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్, బి.శ్రీనివాస్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి యోగా పోటీలకు వైష్ణవి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని మహాత్మా జ్యోతి బా పూలే పాఠశాల నుంచి హిమచల్ ప్రదేశ్ లో 49వ జాతీయ స్థాయి యోగా పోటీలకు మహాత్మా జ్యోతి భాపూలే బీసీ గురుకుల పాఠశాలలో పదవతరగతి చదువుతున్న వైష్ణవి జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైందని శనివారం పాఠశాల ప్రిన్సిపాల్ కె.అంజిరెడ్డి తెలిపారు. సెప్టెంబర్ నెలలో హైదారాబాద్ లో జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో గ్రేటర్ వరంగల్ నగరంలోని కరీమాబాద్ ఉర్సుగుట్ట మహత్మ జ్యోతిభా పూలే పాఠశాలకు చెందిన 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని పి. వైష్ణవి అండర్ 12-14 విభాగంలో తృతీయ స్థాయి బహుమతి గెలుచుకొని జాతీయ స్థాయి యోగా పోటీకి ఎంపికయ్యారని అన్నారు. అక్టోబర్ 24 నుంచి 27 వరకు యోగా పెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో హిమచల్ ప్రదేశ్ లో జరుగుతున్న పోటీలకు వెళుతున్న వైష్ణవిని గురుకుల పాఠశాలల ఆర్ సీఓ రాజ్ కుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ అంజిరెడ్డి, పీఈటీ కోట రజిత, పీడీ మానస, ఉపాధ్యాయ బృందం యోగా క్రీడాకారిణి వైష్ణవిని అభినందించారు.

# పాలకుర్తి ఎస్సై, సీఐలను సస్పెండ్ చేయాలి

## అజ్మీర వెంకట్ డిమాండ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పాలకుర్తి మండల కేంద్రంలోని మేకల తండా గ్రామానికి చెందిన లకావత్ శ్రీనుపై దాడి చేసి ఇబ్బంది పెట్టిన పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర వెంకట్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాలకుర్తి పోలీస్ స్టేషన్ లో నిన్న ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యయత్నం పాల్పడి వరంగల్ ఎంజీఎం లో చికిత్స పొందుతూ తెల్లవారి జామున మృతి చెందిన లకావత్ శ్రీను చావుకు కారకులైన ఎస్ఐ, సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. శీను చావుకి చాలా కారణాలున్నాయని, అతడిని పోలీసులు కొట్టడం బాధాకరం, పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధిత కుటుంబాన్నిఅదుకోవాలని కోరారు. కొంతమంది పెద్ద మనుషుల మాటలు విని పోలీసులు పని చేయడం సరికాదన్నారు. నిందితులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీను తల్లిదండ్రులకు న్యాయం జరగకపోతే గిరిజన సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# టూరిజం హబ్‌గా భూపాలపల్లి నియోజకవర్గం



**వరంగల్ వాయిస్, గణపురం/రేగొండ/చిట్యాల :** భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపసముద్రం, పాండవులగుట్ట, కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, నాపాక ఏకశిల శ్రీ సర్వోతోభద్ర దేవాలయం ప్రాంతాలను టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం ఎమ్మెల్యే జీఎస్సార్ నియోజకవర్గంలోని గణపురం మండలంలోని గణపసముద్రం, రేగొండ మండలం పాండవుల గుట్ట, కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి, చిట్యాల మండలం నైన్ పాక ఏకశిల శ్రీ సర్వతోభద్ర దేవాలయాన్ని రాష్ట్ర టూరిజం



సీఈ వెంకటరమణ, జీఎం(ప్రాజెక్ట్స్) ఉపేందర్ రెడ్డి, డీఈ ధన్ రాజ్, కన్సల్టెంట్ కిషోర్ ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో, ఫారెస్ట్, ఎండోమెంట్ ఇతర శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. కొడవటంచ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయ అర్చకులు, ఎండోమెంట్ అధికారులు అతిథులకు పూర్ణ కుంభం, మేళ తాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ అభివృద్ధి కోసం ఇదివరకే ప్రభుత్వం రూ.12.15 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. గణపసముద్రం, పాండవుల గుట్ట, నాపాక అభివృద్ధికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గాన్ని టూరిజం హబ్ గా అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి, టూరిజం మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.

# 15 లీటర్ల గుడుంబా స్వాధీనం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండలంలోని ప్రగతి సింగారం, వసంతపూర్ గ్రామాల్లో శాయంపేట పోలీసులు పెట్రోలింగ్ చేసి గంగిరేని గూడెం గ్రామానికి చేరుకోగానే బానోతు రమేష్ అనే వ్యక్తి ఇంటి వద్ద గుడుంబా తయారు చేసి, విక్రియానికి వెళ్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు, వాళ్ల ఇంటి వైపుకు వెళ్లారు. పోలీసుల రాకను గమనించి తన వద్ద ఉన్న గుడుంబా ప్యాకెట్లను అక్కడ పడవేసి రమేష్ పారిపోయేందుకు ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని పట్టుకొని అతని వద్ద ఉన్న 15 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని, నిందితుడిని శాయంపేట పోలీసు స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారు.

# పద్మశాలి దసరా మేళాను విజయవంతం చేయాలి

## అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేపు హైదరాబాద్ ఎల్బీనగర్ లో నిర్వహించే పద్మశాలి దసరా మేళా సమావేశాన్ని పద్మశాలి కులస్తులు విజయవంతం చేయాలని అఖిల భారత పద్మశాలి సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పద్మశాలి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆనందం పద్మశాలి దసరా మేళా పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పద్మశాలి ఆత్మీయ సమ్మేళనం రేపు ఉదయం 10:30 గంటలకు ఎల్బీనగర్ లోని హరిణి వనస్థలి జింకల పార్కు వద్ద నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి జిల్లా నుంచి పద్మశాలి కులస్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తవుటం రవీందర్, పద్మశాలి యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పోరడ్ల కృష్ణ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రశాంత్, మీడియా కోఆర్డినేటర్ పులికంటి రాజేందర్, బూర్ల నాగరాజు, బిట్ల రాహుల్ పాల్గొన్నారు.

# మాతృ, శిశు మరణాలపై అవగాహన కల్పించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో డాక్టర్ కె.వెంకటరమణ శనివారం ఆశా కార్యకర్తల దినచర్య రికార్డు ప్రారంభించారు. అనంతరం వెంకటరమణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామాల్లో, పట్టణాల్లో అవసరం ఉన్న ప్రజలకు సేవలందించి వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకుండా మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా అవగాహన కల్పించి వైద్య ఆరోగ్య శాఖ నుంచి అన్ని సేవలు అందేటట్లు చూడాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు ప్రతిరోజు గ్రామాలు, పట్టణాలలో వార్డులలో వారు ప్రజలకు అందించే అర్హులైన దంపతుల రిజిస్టర్, గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టర్, ప్రసవించిన తర్వాత సేవలందించే రిజిస్టర్ నవజాత శిశువుల రిజిస్టర్, పిల్లలకు వ్యాక్సినేషన్ రిజిస్టర్, బాలింతల శిశు మరణాల రిజిస్టర్ సంక్రమిత వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికెన్ గునియా, కలరా, టీబీ, లెప్రసీ, మొదలగునవి నమోదు చేసే రిజిస్టర్, అసంక్రమిత వ్యాధులు క్యాన్సర్, గుండెపోటు,పెరాలసిస్, మొదలగు వ్యాధుల సంబంధించిన రిజిస్టర్, మొదలగు రిజిస్టర్ లతో పాటు గృహ సందర్శన వారి నెలవారి ప్రగతికి సంబంధించిన రిజిస్టర్ ఉంటాయి. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్ పద్మశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ గోపాలరావు, ప్రోగ్రాం అధికారి మోహన్ సింగ్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, డీపీహెచ్ఎన్ఓ జ్ఞాన సుందరి, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ సినిమా
శనివారం 19 అక్టోబర్ 2024
7



# మేజర్ ముకుంద్ వరదరాజన్ బయోపిక్

అమరన్ మూవీలో శికార్తికేయన్, సాయపల్లవి జంట
శివ కార్తికేయన్, సాయిపల్లవి జంటగా నటించిన చిత్రం 'అమరన్' రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో శివ కార్తికేయన్ ఆర్మీ అధికారి మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్రలో కనిపించనున్నారు. తాజాగా చెన్నై వేదికగా దీని ఆడియో లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సాయిపల్లవిని శివకార్తికేయన్ ప్రశంసించారు. 'మేజర్ ముకుంద్ వరదరాజన్ గురించి మొదట వార్తల్లో విన్నా. రాజ్ కుమార్ ఈ కథను వివరించినప్పుడు భావోద్వేగానికి గురయ్యా. ముకుంద్ గొప్ప లీడర్. ఈ చిత్రం క్లైమాక్స్ అందరినీ కంటతడి పెట్టిస్తుంది. ముకుంద్ అందమైన జీవితాన్ని, ఆయన కుటుంబాన్ని అందరూ గౌరవించేలా దీన్ని తీర్చిదిద్దాం. ఈ సినిమా కోసం ఆయన కుటుంబాన్ని సంప్రదించినప్పుడు తమిళ హీరోతోనే తీయాలని వాళ్లు కోరారు. ముకుంద్‌కు తమిళ పరిశ్రమ అంటే ఎంతో ఇష్టమని చెప్పారు. నేను ఓ టీవీ ఛానల్‌లో వర్క్ చేస్తున్నప్పుడు సాయిపల్లవిని మొదటిసారి కలిశాను. నేను వ్యాఖ్యతగా వ్యవహరించిన ఓ కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఇండస్ట్రీలో ఆమె పేరే ఒక బ్రాండ్. 'ప్రేమమ్'లో ఆమె నటన చూసి ఆశ్చర్యపోయా. ఫోన్ చేసి ప్రశంసించా. ఆమె వెంటనే 'థ్యాంక్యూ అన్నా' అని చెప్పింది. నన్ను అన్నా అని పిలిచినందుకు అప్పుడు చాలా ఫీలయ్యాను. ఆమె గొప్ప నటి' అని అన్నారు. 'ఈ సినిమా దేశమంతా గర్వపడుతుంది. ఇటీవల కమల్‌హాసన్ ఈ చిత్రం చూసి భావోద్వేగానికి గురయ్యారు. టిష్యూలు దగ్గర పెట్టుకొని దీన్ని చూశారు' అని దర్శకుడు లోకేశ్ కనగరాజ్ అన్నారు. మణిరత్నం మాట్లాడుతూ..'ముకుంద్ లాంటి గొప్ప వ్యక్తుల గురించి అందరూ తెలుసుకోవాలి. నేను సాయి పల్లవికి పెద్ద అభిమానిని. భవిష్యత్తులో ఆమెతో కలిసి వర్క్ చేయాలని కోరుకుంటున్నా' అని చెప్పారు.




# కాస్ట్ కౌచింగ్ అంతా దుష్ప్రచారం

## తెలుగు పరిశ్రమపై అనన్య నాగళ్ల

అచ్చ తెలుగమ్మాయి హీరోయిన్ అనన్య నాగళ్ల త్వరలో పొట్టేల్ అనే రూరల్ పిరియాడిక్ డ్రామా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. దీపావళికి ఈ మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో తాజాగా ఈ చిత్ర యూనిట్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా కాస్టింగ్ కౌచ్ పై షాకింగ్ ప్రశ్నలు వేయగా నటి అనన్య కూడా అదే రేంజ్‌లో జవాబు ఇచ్చి ఔరా అనిపించింది. తెలుగు అమ్మాయిలు ఇండస్ట్రీలోకి రావాలంటే భయపడతారు.. అవకాశాలు ఇవ్వాలంటే కమిట్మెంట్ అడుగుతారని టాక్ ఉంది కదా మీకు ఇలాంటి అనుభవం ఎదురైందా అని ఓ మహిళా విలేకరి అనన్య కు ప్రశ్న వేసింది. దానికి ఆమె వందశాతం తప్పు అని ఆనన్య సమాధానమిచ్చింది. అవకాశం రావడం కంటే ముందే కమిట్మెంట్ అనేది టాలీవుడ్‌లో లేదని, ఎక్కడైనా పాజిటివ్, నెగెటివ్ అనేది సమానంగా ఉంటాయని మీరు ఎక్స్ పీరియన్స్ చేయకుండా అలా ఎలా అడుగుతున్నారంటూ అనన్య ఆన్సర్ ఇచ్చింది. అంతేగాక నటిగా నేను చెబుతున్నా క్యాస్టింగ్ కౌచ్ పరిస్థితులైతే ఇండస్ట్రీలో లేవని తెలిపారు. నేను ఆ ఫీల్డ్ లోనే ఉన్నా. మీరు అనుకున్నది ఇక్కడ లేదని అనన్య గట్టిగా బదులిచ్చింది. అక్కడ అనన్య సమాధానాలు విన్న చాలామంది అనన్య ధైర్యాన్ని, బయ పడకుంగా చెప్పిన విధానాన్ని చాలామంది మెచ్చుకోవడమే కాక చప్పట్లతో ప్రశంసించారు.








## ప్రీ ఇండిపెండెన్స్ స్టోరీగా ఫౌజీ

ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందనున్న చిత్రానికి 'ఫౌజీ' అనే టైటిల్ పరిశీలిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ సైనికుడిగా నటిస్తున్నాడు. అందుకే ఈ టైటిల్ పెడితే బాగుంటుందని చిత్రబృందం భావిస్తోందట. ప్రస్తుతానికి ఇదే ఈ సినిమా వర్కింగ్ టైటిల్. దీనికంటే మంచి టైటిల్ ఆలోచన వస్తే.. దాన్నే ఫిక్స్ చేస్తారట. లేదా 'ఫౌజీ' టైటిల్‌నే ఖరారు చేస్తారట. 1947 కంటే ముందు సాగే కథ ఇది. ప్రభాస్ బ్రిటీష్ సైన్యంలో ఓ సోల్జర్‌గా కనిపించనున్నాడు. అయితే ఇప్పటికే వరుసగా మూడు, నాలుగు సినిమాల షూటింగ్స్ తో ప్రభాస్ బిజీబిజీగా గడుపుతున్నారు. మరోవైపు ఫౌజి సినిమా షూటింగ్ కూడా ప్రారంభమవడంతో ఈ సినిమా నుంచి ఓ అప్డేట్ అందింది. ప్రభాస్ బర్త్ డే సందర్భంగా ఆ ట్రీట్ రివీల్ చేయబోతున్నారు. ప్రస్తుతం ప్రభాస్ 'రాజా సాబ్', 'ఫౌజి', 'సలార్ 2', 'కల్కి 2', 'స్పిరిట్' సినిమాల్లో నటిస్తున్నారు. మొదటగా వచ్చే ఏడాది సమ్మర్‌లో రిలీజ్ కానున్న మారుతీ చిత్రం 'ది రాజా సాబ్' షూటింగ్ లో బిజీబిజీగా గడుపుతున్నాడు.తదుపరి 'ఫౌజి' సినిమా షూటింగ్ కూడా ప్రారంభమైంది. అయితే ప్రస్తుతం ప్రభాస్ డేట్స్ లేకపోవడంతో డైరెక్టర్ మొదటి షెడ్యూల్‌లో ఇతర సీన్స్ చిత్రీకరిస్తున్నారు.

# బాలకృష్ణ అన్‌స్టాపబుల్ 4 రెడీ








## తొలుత బన్నీతో అనుకుని షూటింగ్ పార్ట్ పూర్తి తాజాగా బాబు, పవన్‌తో ఉంటుందని ప్రచారం

నందమూరి బాలకృష్ణ హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఓటీటీ షో 'అన్‌స్టాపబుల్' సీజన్ 4' స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. దీపావళి పండగని పురస్కరించుకొని తొలి ఎపిసోడ్ రిలీజ్ చేసేందుకు ప్రయ్నత్నాలు జరుగుతున్నాయి. అయితే అన్ స్టాపబుల్ 4 ఫస్ట్ ఎపిసోడ్‌కు అల్లు అర్జున్ గెస్ట్‌గా రానున్నట్లు వార్తలు వచ్చాయి. పుష్ప 2 మూవీ రిలీజ్ కానున్న నేపథ్యంలో పుష్ప టీమ్ గెస్ట్ లుగా రానున్నారు. అయితే ఈ ఎపిసోడ్ షూట్ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. కాగా పుష్ప మూవీ డిసెంబర్‌లో రిలీజ్ కానుండటంతో ఈ ఎపిసోడ్‌ని మూవీ రిలీజ్ టైమ్‌లో విడుదల చేద్దామని ప్లాన్ చేశారట. దీంతో ఫస్ట్ ఎపిసోడ్ కోసం ఇద్దరు ప్రభుత్వాధినేతలను పిలుస్తున్నట్లు సమాచారం. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో సంచలన విజయం సాధించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఈ షోకి మరోసారి గెస్ట్‌గా రానున్నట్లు సమాచారం. అలాగే ఈ ఎపిసోడ్‌నే తొలి ఎపిసోడ్‌గా దీపావళి కానుకగా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తుందట ఆహా. అయితే చంద్రబాబు నాయుడితో పాటు ఈ ఎపిసోడ్‌లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హాజరు కానున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్న అఫిషియల్‌గా ఎలాంటి సమాచారం లేదు. కాగా సోషల్ మీడియా వేదికగా బన్నీ వర్సెస్ మెగా ఫ్యాన్స్‌గా నడుస్తున్న గొడవలకి ఈ షో ఏమైనా ఫుల్ స్టాప్ పెడుతుందా చూడాలి.

# తిన్నదంతా కక్కిస్తాం..

- హస్తం అభివృద్ధితో కారు బేజారు
- నాడు నెహ్రూ, నేడు రేవంత్ పాలనలో పాలిటెక్నిక్ కు మహర్థశ
- మూసీపై ప్రతిపక్షాలు తప్పు తోవ పట్టిస్తున్నాయ్
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అభివృద్ధి పేరుతో బీఆర్ఎస్ నాయకులు తిన్నదంతా కక్కిస్తామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ప్రకటించారు. తప్పుడు ప్రకటనలో నియోజకవర్గం జోలికొస్తే సహించేది లేదని హెచ్చరించారు. బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం (ప్రజా భవన్ ) శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హస్తం అభివృద్ధి హోరులో కారు నాయకులు బేజారవుతున్నారని ఎద్దేవా చేశారు. నాడు నెహ్రూ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ భవన నిర్మాణం జరిగితే నేడు రేవంత్ పాలనలో పాలిటెక్నిక్ కు మహర్థశ పట్టనుందన్నారు. రూ.28కోట్ల నిధులతో హనుమకొండ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణం కొరకు జీఓ అందజేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు జిల్లా ప్రజలు, విద్యార్థుల పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనతి కాలంలోనే పశ్చిమ నియోజకవర్గంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. కొద్దీ రోజుల్లోనే నయా వరంగల్ ను చూడబోతున్నామన్నారు. అధికారం లేకపోవడంతో కేటీఆర్ కు పిచ్చి పట్టి ఆగమాగం అవుతున్నాడన్నారు. మూసీలో ఉన్న మురికి తీసి పునర్జీవం చేద్దామని ప్రభుత్వం చూస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. పదేళ్ల బీఆర్ఎస్ అవినీతి పాలనలో నిర్మించుకున్న ఫామ్ హౌస్ లు, బంగ్లాలు ఎక్కడ కూల్చివేస్తారోనన్న భయంతో అడ్డమైన కూతలు కూస్తున్నారన్నారు. ప్రజలి వీటిని గమనిస్తున్నారన్నారు. ప్రతి అంశంపై ఇకనుంచి ప్రజలే బుద్ది చెపుతారంటూ హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి పాటు పడుతుంటే బీఆర్ఎస్ యూట్యూబ్ ఛానెల్స్ లో గ్లోబెల్ ప్రచారాలతో పబ్బం గడుపుతున్నాయన్నారు. మూసి పునర్జీవ పనులు ప్రారంభం కాకముందే అవినీతి జరిగింది అనేందుకు సిగ్గుండాలన్నారు. త్వరలో వరంగల్ పర్యటనకు రానున్న ముఖ్యమంత్రి నోటి వెంట నగరానికి ఊహించలేని వరాలు రానున్నాయిన్నారు. అభివృద్ధి పనులు మేం చేస్తూ వెళ్తున్న క్రమంలో బీజేపీ, బీఆర్ఎస్ మాదంటే మాదని కొట్టుకు చస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా దిగజారుడు మాటలు, దిగజారే రాజకీయ ప్రవర్తనని మార్చుకుని ప్రతిపక్షాలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్బంగా హనుమకొండ పాలిటెక్నిక్ కాలేజీ యాజమాన్యం, పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేకంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చొరువ చూపండి..

రాష్ట్ర వ్యాప్తంగా గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ తక్షణమే విడుదల చేసి, విద్యార్థుల ఉన్నత చదువుల అభివృద్ధికి చొరువ చూపాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. శనివారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకట్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, రాష్ట్ర కన్వీనర్ హకీం నవీన్, యూఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్, పీడీఎస్ యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నరసింహారావు, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల చరణ్, యూఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రాకేష్, శ్రీపతి వినయ్, హర్ష, పి.సతీష్, అర్జున్, వినయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



# అందరి సహకారంతో అభివృద్ధి

## కేయూ వీసీ ప్రతాప్ రెడ్డి- వెల్లువెత్తిన అభినందనలు

**వరంగల్ వాయిస్, కేయూ :** అందరి సహకారంతో విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేద్దామని కాకతీయ విశ్వవిద్యాలయం నూతన వైస్ ఛాన్సలర్ ఆచార్య కర్నాటి ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం కేయూకు విచ్చేసిన ప్రతాప్ రెడ్డిని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం వైస్ ఛాన్సలర్ గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. పాలక మండలి సభ్యులు డాక్టర్ బి.రమ, డాక్టర్ సుదర్శన్, డాక్టర్ సుకుమారి, డాక్టర్ ఎం.నవీన్, డాక్టర్ చిర్రా రాజు, పుల్లూరి సుధాకర్ తో పాటు, పలువురు డీన్ లు, ప్రిన్సిపాల్ లు, విభాగ అధిపతులు, అసోసియేషన్స్ బాధ్యులు, పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు వీసీని కలిసి అభినందలు తెలిపారు. కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం సంచాలకు ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ నరసింహారావు లు ఉపకులపతి ప్రతాప్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

# మా కూతురు వివాహానికి రండి

## సురేఖను ఆహ్వానించిన జంగా రాఘవరెడ్డి దంపతులు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ జంగా రాఘవ రెడ్డి, సుజాత దంపతులు శనివారం రాష్ట్ర అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వివాహ ఆహ్వాన పత్రికను అందించి, నవంబర్ 3న మడికొండలోని సత్యసాయి గార్డెన్స్ లో జరుగనున్న తమ కూతురు వివాహానికి హాజరై, వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.



# ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై అవగాహన

## బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశం

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి బైరి మురళీకృష్ణ అధ్యక్షతన శనివారం భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యాలయం, ధర్మారంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పాల్గొని రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ నమోదు కార్యాచరణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఎరుకల రఘునారెడ్డి, తాబేటి వెంకట్ గౌడ్, పిఠాపురం ఏకాంతం గౌడ్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జిల్లా, నియోజకవర్గ ఇంచార్జిలు, సహ ఇంచార్జిలు, జిల్లా పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, పలు డివిజన్, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

# ఘన వ్యర్థాల నిర్వహణపై ఎక్స్ పో

- ప్రారంభించిన ఎమ్మెల్యే, మేయర్
- సాంకేతిక సహకారం అందించేందుకు 10 స్టాళ్ల ఏర్పాటు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తడి చెత్తను ఎరువుగా మార్చడంపై అవగాహన అవసరమని వరంగల్ (పశ్చిమ) ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారంవారం వరంగల్ వెంకటేశ్వర గార్డెన్ లో బల్దియా ఆధ్వర్యంలో ఆస్కి( అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) సహకారంతో ఏర్పాటు చేసిన 'బల్క్ ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్మెంట్ టెక్నాలజీ అండ్ ప్రాసెస్' కార్యక్రమానికి ఎమ్మెల్యే, మేయర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పది సాంకేతికత (అవగాహన) స్టాళ్లను ప్రారంభించి ఆయా కంపెనీలు రూపొందించిన, యంత్రాల ద్వారా ప్రదర్శించిన సాంకేతిక పద్ధతులను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తడి చెత్తను సమర్ధవంతంగా నిర్వహించడంపై ఏర్పాటు చేసిన ప్రదర్శనలో నగర ప్రజలు అవగాహన కల్పించుకొని స్వచ్ఛ వరంగల్ గా తీర్చిదిద్దాలని కోరారు. ముఖ్యంగా ఆసుపత్రులు, హోటళ్లు, అపార్ట్మెంట్ లలో ప్రతిరోజు వెలుపడే బల్క్ ఆర్గానిక్ వ్యర్థాలను యంత్రాల ద్వారా ఎరువుగా, బయోగ్యాస్, విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియను ఈ ఎక్స్ పోలో తెలుసుకొని వాటిని వినియోగించుకొని ఆర్థిక లాభాలు పొందాలన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరిన విధంగా వరంగల్ నగరాన్ని స్వచ్ఛ నగరం, పచ్చ నగరంగా తీర్చిదిద్దంలో భాగంగా బల్దియా ఆధ్వర్యంలో ఆస్కి సహకారంతో తడి చెత్తను ఎరువుగా మార్చడంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతిరోజు నగరం నుంచి వెలువడే 230 టన్నుల బల్క్ ఆర్గానిక్ వ్యర్థాలు, ఇంటింటి నుంచి వెలుపడే తడి చెత్తను కంపోస్ట్ చేసి యంత్రాల ద్వారా ఎరువుగా మార్చే ప్రక్రియను దేశంలోని వివిధ ప్రముఖ కంపెనీలు నిర్వహించిన ప్రదర్శనపై ఆసుపత్రులు, హోటళ్లు, అపార్ట్మెంట్ ల యజమానులు అవగాహన కల్పించుకోవాలన్నారు.



జీడబ్ల్యూఎంసీ కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వివిధ కంపెనీల ద్వారా తడి చెత్తను కంపోస్ట్ ప్రక్రియపై యంత్రాల ద్వారా వివరించడం జరిగిందని, అందులో అత్యున్నతమైన యంత్రాలను కొనుగోలు చేసి అమలు చేయడం జరుగుతుందన్నారు. బల్క్ ఆర్గానిక్ వ్యర్థాల నిర్వహణ ప్రక్రియ సక్రమంగా అమలు చేసి పర్యావరానికి సమాజానికి మేలు చేసే ప్రణాళికను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, మానస రాంప్రసాద్, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, రాజయ్య, బయాలజిస్ట్ మాధవరెడ్డి, సెక్రటరీ విజయలక్ష్మి, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్న రాణి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, అస్కి ప్రతినిధులు రాజ్ మోహన్, అవినాష్ ప్రతిభ, పలు కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com